సాక్షి శ్రీకాకుళం

సోమవారం ; 20 ; మార్చి ; 2023



పంట పండింది!

జిల్లాలో రబీ పంట బాగా పండింది. దిగుబడులు బాగున్నాయని రైతులు చెబుతున్నారు.

- 8లో



ఉత్సాహంగా మిస్టర్ ఆంధ్రా..

మిస్టర్ ఆంధ్రా పోటీలు జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా జరిగాయి. పోటీదారులు శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు.

- 8లో

నేడు వాహనాల వేలం

కాశీబుగ్గ: పలాస స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ వారు వివిధ ఎక్సైజ్ నేరాల్లో స్వాధీనం చేసుకున్న ఎనిమిది వాహనాలను ఎస్ఈబీ స్టేషన్ వద్ద సోమవారం ఉదయం వేలం వేయనున్నట్లు ఎస్‌హెచ్‌ఓ కోన కృష్ణారావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డుతో పాటు రూ.వెయ్యి నగదుతో హాజరు కావాలని సూచించారు.

న్యూస్‌రీల్

జగనన్న మహిళా మార్ట్‌లపై కేరళ టీమ్ సంతృప్తి



మహిళలతో మాట్లాడుతున్న కేరళ టీమ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్‌లు ఎంతో బాగున్నాయని కుటుంబశ్రీ, కేరళ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాఫర్‌మాలిక్ అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మెప్మా విభాగంలో అమలవుతున్న కార్యక్రమాలను కేరళ రాష్ట్రం నుంచి వచ్చిన బృందం ఆదివారం పరిశీలించింది. ఈ సందర్భంగా మహిళామార్ట్‌లు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న మహిళల చేయూత కార్యక్రమాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. పొదుపులు, అప్పుల చెల్లింపు ఎలా జరుగుతుంది అనే విషయాలపై తెలుసు కుని కేరళలో అమలు చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతు న్న చేయూత, జగనన్న తోడు, అమ్మ ఒడి, సున్నావడ్డీ కార్యక్రమాలు ఎంతో ఆదర్శవంతంగా ఉన్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే అమలవుతున్న 'గుప్పెడు బియ్యం' కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంలో మెప్మా పీడీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు



నాటిక పోటీల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న శంకరశర్మ తదితరులు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ ఇంద్రపుష్కరిణి ప్రాంగణంలోని శ్రీ వైజయంతి ఉత్సవ వేదిక లో ఈనెల 25, 26, 27 తేదీల్లో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లుగా ఆలయ ప్రధానార్చకులు, శ్రీసుమిత్ర కళా సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం అరసవల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకర శర్మ నాటిక పోటీల వివరాలను వెల్లడించారు. ఈనెల 25వ తేదీ శనివారం సాయంత్రం 7 గంటల నుంచి కమనీయం, అక్కఅలుగుడు-చెల్లి సణుగుడు, 26వ తేదీ సాయంత్రం అతీతం, బరిబత్తల రాజు, మృత్యుపత్రం, ఈనెల 27న సాయంత్రం కొత్త పరిమళంచ ది లాస్ట్ జడ్జిమెంట్ పేరిట నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. అంతకుముందు ఈ కార్యక్రమానికి చెందిన ఆహ్వానపత్రికలను శ్రీసుమిత్ర కళా సమితి ప్రతినిధులంతా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండవల్లి రవి, నక్క శంకర రావు, గుత్తు చిన్నారావు, ప్రధాన విజయ రామ్, డి.పార్థసారధి, వివిఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సౌత్‌జోన్ హాకీ పోటీలకు ఇద్దరు ఎంపిక



పి.తరుణ్



బి.రేవతి

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆలిండియా సౌత్‌జోన్ జూనియర్స్ (అండర్-18) హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక య్యారు. ఎంపికైనవారిలో పి.తరుణ్ (ఇంటర్ సెకెండియర్-ఎన్ఆర్ఐ కాలేజ్ శ్రీకాకుళం), బి.రేవతి (ట్రిపుల్ ఐటీ సెకెండియర్ ఎచ్చెర్ల) ఉన్నారు. వీరిద్దరూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలబాలికల జట్లకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ పోటీలు ఆదివారం ప్రారంభం కాగా.. ఈ నెల 26వ తేదీ వరకు తమిళనాడు వేదికగా జరగనున్నాయి. జాతీయ పోటీలకు జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపిక కావడంపై శ్రీకాకుళం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, కార్యదర్శి మధుసూదన్, ఉపాధ్యక్షురాలు వై.లావణ్య, వై.మనోజ్ కుమార్, పి.బాలమురళి కృష్ణ, జె.రమేష్, బి.ఈశ్వరప్రసాద్, శ్రీనివాస్, హాకీ అసో షియేషన్ కోచ్ అల్లు నవీన్‌కుమార్ తదతరులు సంతోషం వ్యక్తం చేశారు. తుది వరకు పోరాడి ఆంధ్రా జట్లను విజయపథంలో నిలపాలని వారంతా ఆకాంక్షించారు.

● పిచ్చుక.. కాపాడుకోవచ్చుగా!



ఒకప్పుడు ఊరంతా మాదే అన్నట్టు తిరిగిన ఊరపిచ్చుకలు ఇప్పుడు ఊరికైనా కనిపించడం లేదు. పట్టణీకరణ ప్రభావంతో ఆవాసాలు కరువైపోయి ఇవి కనుమరుగైపోతున్నాయి. వీటిని రక్షించాలనే ఉద్దేశంతో ఏటా మార్చి 20న అంతర్జాతీయ ఊరపిచ్చుకల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సుపేట గ్రామానికి చెందిన తరణి ప్రసాద్ మిశ్రా వంశధార నదీ తీరంలో ఇలా సైకత పిచ్చుకను తీర్చిదిద్దారు. – ఎల్.ఎన్.పేట

24/7 నిఘా



150 కిలోమీటర్ల పొడవునా..

- ఎన్‌హెచ్-16 దారి పొడుగునా సీసీ కెమెరాల ఏర్పాటు
- పైడిభీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకు 210 కెమెరాలు
- సోలార్ పరికరాలతో నిరంతరం రికార్డింగ్

- జిల్లాలో పైడి భీమవరం నుంచి ఇచ్ఛాపురం వరకూ 150 కిలోమీటర్లు పొడవునా ఎక్కడికక్కడ 210 సీసీ కెమెరాలను అమర్చారు.
- నరసన్నపేట-శ్రీకాకుళంల మధ్య 18 కెమెరాలు ఉన్నాయి.
- నరసన్నపేట-కోటబొమ్మాళి మధ్య మరో 18 సీసీ కెమెరాలు పెట్టారు.
- అలాగే కోటబొమ్మాళి-టెక్కలిల మధ్య 22 కెమెరాలు ఏర్పాటు చేశారు.
- ఇలా దారి పొడవునా ప్రతీ కూడలి వద్ద అత్యాధునిక కెమెరాలు పెట్టారు.

నరసన్నపేట: జిల్లాలో జాతీయ రహదారిని నిఘా నేత్రాలు నిత్యం చూస్తూనే ఉన్నాయి. రాకపోకలు సాగించే వాహనాలను రోజంతా కనిపెడుతూనే ఉన్నాయి. ప్రమాదాలు చేసి పారిపోవడం, ఖాకీల కళ్లు గప్పి తప్పించుకోవడం వంటివి ఇకపై కుదరవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కెమెరాలతో కనిపెట్టడమే కాదు.. ఆ ఫుటేజీని నిక్షిప్తం చేయడం కూడా జరుగుతోందని, ఇకపై నేరగాళ్లను పట్టుకోవడం సులభమవుతుందని వారు చెబుతున్నారు.

సోలార్‌తోనే..

జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన కెమెరాలు విద్యుత్‌తో పనిలేకుండా సోలార్‌తో పనిచేయడం మరో విశేషం. సీసీ ఫుటేజీలను ఇతరులు దొంగిలించకుండా ఉండేందుకు వీలుగా ఎక్కడికక్కడే ప్రత్యేకంగా బాక్స్‌లు పెట్టి నిక్షిప్తం చేస్తున్నారు. నెల రోజుల పాటు సీసీ ఫుటేజీలు భద్రపరిచే విధంగా మెమొరీ కార్డులు అమర్చినట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో జాతీయ రహదారిపై చీమ చిటుక్కుమన్నా పోలీసులకు తెలిసిపోతుంది. ఇక నుంచి వాహనాలు ప్రమాదాలు చేసి తప్పించుకొని పోయే అవకాశాలు తక్కువవుతాయని పోలీసులు భావిస్తున్నారు.

చాలా ఉపయోగం..

ఈ సీసీ కెమెరాల వల్ల దొంగలను పట్టుకోవడంతో పాటు ఇంకా ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని నరసన్నపేట సీఐ డి.రాము చెబుతున్నారు. గతంలో గుర్తు తెలియని వాహనాలు ఢీ కొట్టడం వల్ల పౌరులు చనిపోవడం, గాయపడడం జరిగేదని, అలాంటప్పుడు బాధిత కుటుంబాలకు బీమా వంటి ప్రయోజనాలు అందేవి కాదని తెలిపారు. ఇప్పుడు ప్రమాదానికి కారణమైన వాహనాలను గుర్తించడం ద్వారా బీమా అందే అవకాశం కలుగుతుందన్నారు. జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే ప్రతి వాహనం సీసీ కెమెరా కంటిలో పడుతుందని, దొంగలు, యాక్సిడెంట్లు చేసిన వారు తప్పించుకుపోవడం కష్టమని తెలిపారు.



నరసన్నపేట మండలం దేవాది కూడలి వద్ద జాతీయ రహదారిపై అమర్చిన సీసీ కెమెరాలు

● మెరుపు ఇలా..



పలాస మండలం తర్లాకోట పురాతన కోటవద్ద చిత్రమిది. ఆదివారం ఉదయం 6.15 నిమిషాలకు కురిసిన వర్షంలో ఇలా మెరుపులు మెరిశాయి. – కాశీబుగ్గ

నేడు సెంట్రింగ్ కార్మికుల స్వచ్ఛంద బంద్

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న సెంట్రింగ్ కార్మికులు సోమవారం స్వచ్ఛంద బంద్‌కు పిలుపునిచ్చారు. రవాణా, లేబర్, ముడిసరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రస్తుతం కూలి గిట్టుబాటు కావడం లేదని శ్రీమణికంఠ సెంట్రింగ్ యూనియన్ ప్రతినిధులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కూలి గిట్టుబాటయ్యేలా చూడాలని, బంద్‌కు సహకరించాలని సంఘ గౌరవ అధ్యక్షుడు కుప్పిలి వైకుంఠరావు, అధ్యక్షుడు ఇప్పిలి శ్రీనివాసరావు తెలిపారు.

ఆలయంపై పిడుగుపాటు

- శ్రీకాకుళంలోని బలగ భద్రమ్మ తల్లి ఆలయంపై పిడుగు
- గోపురంపై విగ్రహాలు ధ్వంసం



భద్రమ్మ తల్లి అమ్మవారి విగ్రహం

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని బలగ భద్రమ్మ తల్లి ఆలయంపై ఆదివారం ఉదయం 9.30 గంటల సమయంలో పిడుగు పడింది. ఆ సమయంలో ఆలయం చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అర్చకులు పూజారి పొట్నూరు శ్రీను లోపల పూజ చేస్తుండగా పెద్ద శబ్దంతో పిడుగు పడడంతో ఉలిక్కిపడ్డారు. ఈ పిడుగు ధాటికి ఆలయ గర్భగుడిలోనుంచి గోపుర సౌరంగం చివరి భాగాన పెచ్చులూడి కిందకు పడ్డాయి. అర్చకుడు బయటకు వచ్చి చూస్తే గోపురం బయట అంచున వెనుక భాగాన ఉన్న కాళీమాత, లక్ష్మీదేవి విగ్రహాలు పూర్తిగా ధ్వంసమై కనిపించాయి. గోపురంపైకి వెళ్లి చూస్తే మరో రెండు విగ్రహాలు ధ్వంసమైనట్లు తెలిసింది. అమ్మవారి మూలవిరాట్టుకు మాత్రం ఏమీ కాలేదు. విగ్రహంపైన ఉండే ఛత్రం పడిపోయింది. 165 ఏళ్ల చరిత్ర ఉన్న ఈ ఆలయాన్ని ఏడాదిన్నర కిందటే గ్రామస్తులు చందాలు వేసుకుని జీర్ణోద్ధరణ చేశారు. రూ.3లక్షల మేర నష్టం ఉంటుందని భావిస్తున్నారు.



భద్రమ్మ ఆలయ గోపురం ముందుభాగంలో పాక్షికంగా దెబ్బతిన్న రెండు విగ్రహాలు

పిడుగు పాటుకు 78 మూగజీవాలు మృతి



పిడుగు పాటుతో మృతిచెందిన మేక, గొర్రె పిల్లలు

టెక్కలి రూరల్: మండలంలోని అయోధ్యపురం పంచాయతీ పరిధిలోని దీపావళి గ్రామంలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి 78 మేక, గొర్రె పిల్లలు మృతిచెందాయి. పశుసంవర్ధకశాఖ అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలికి చెందిన డొక్కరి రాజు, ఆదినారాయణ, లక్ష్మణరావు, మల్లేషు, కృష్ణ, రామారావులకు చెందిన సుమారు 78 మేక, గొర్రె పిల్లలను తీసుకుని దీపావళి గ్రామంలో మంద వేశారు. ఆదివారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు వచ్చి పిడుగు పడడంతో మూగజీవాలన్నీ ఊపిరి వదిలేశాయి. విషయం తెలుసుకున్న యజమానులు సంఘటన స్థలానికి చేరుకుని విలపించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి నివేదికను ఉన్నతధికారులకు అందజేస్తామని పశుసంవర్ధక శాఖ ఏడీ జి.రఘునాథ్ తెలిపారు.

'కూన' వ్యాఖ్యలపై మండిపాటు



నర్సు నరేంద్ర యాదవ్

ఇచ్ఛాపురం రూరల్: గొర్రెలు కాసేవాళ్లు హీనులు అంటూ వ్యాఖ్యానించిన టీడీపీ నాయకుడు కూన రవికుమార్‌కు యాదవులపై అంత చిన్నచూపు ఎందుకని అఖిల భారతీయ యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి నర్సు నరేంద్ర యాదవ్ ప్రశ్నించారు. 'ఉత్తరాంధ్ర మంత్రులు గొర్రెలు కాసేవారి కంటే హీనం' అంటూ విశాఖపట్నంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కూన రవికుమార్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఆదివారం నర్సు నరేంద్రయాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలు కాసేవారు యాదవులు. అలాంటి యాదవులు ఆది నుంచి తెలుగుదేశం పార్టీకి కొమ్ముకాస్తూనే ఉన్నారని, అందుకే కూన రవి తన అగ్రవర్ణ, పెత్తందారు భావజాలాన్ని యాదవులపై ప్రదర్శించారని అన్నారు. జిల్లాలో యాదవులను టీడీపీ వారు వాడుకొని వదిలేశారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో యాదవులు మీ పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

'యాదవులకు కూన రవి క్షమాపణ చెప్పాలి'

టెక్కలి: యాదవుల పట్ల చులకన భావంగా మాట్లాడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వెలువడిన ఎమ్మెల్సీ ఫలితాల్లో కూన రవి యాదవ సామాజిక వర్గాన్ని ఉద్దేశించి చులకనగా మాట్లాడారని గుర్తు చేశారు. తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్పీకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

'చేనేతకు చేయూతనందించాలి'



చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఆర్‌జేడీ ధనుంజయరావు తదితరులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): చేనేత కార్మికులు తయారు చేసే వస్త్రాలను జిల్లా ప్రజలు కొనుగోలు చేసి వారిని ప్రోత్సహించాలని చేనేత, జౌళి శాఖ ప్రాంతీయ ఉపసంచాలకులు బి.ధనుంజయరావు కోరారు. న్యూఢిల్లీ చేనేత జౌళి అభివృద్ధి మంత్రిత్వ శాఖ సౌజన్యంతో జిల్లా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. డీపీఆర్ఓ కేబీఎం సింగ్, చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌జేడీ మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత అతి పెద్ద వృత్తి చేనేత రంగం అని అన్నారు. చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలుచేస్తున్న సంగతిని ఆయన గుర్తు చేశారు. చేనేత కార్మికులు తయారుచేసే వస్త్రాలకు మార్కెటింగ్ ప్రధాన సమస్య అని, ఈ సమస్యను అధిగమించి కార్మికులను ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా ఇలాంటి వస్త్ర ప్రదర్శనలను ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా ప్రధాన కేంద్రంలో ఈ నెల 19 నుంచి 25 వరకు వివిధ రాష్ట్రాల వస్త్ర ప్రదర్శనతో పాటు విక్రయాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఐ.ధర్మారావు మాట్లాడుతూ ఎనిమిది జిల్లాలకు చెందిన సుమారు 20 సహకార ఉత్పత్తి సంఘాలకు చెందిన అన్ని రకాల వస్త్రాలను ఇక్కడ ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా నుంచి కూడా వచ్చి ప్రదర్శనలో పాల్గొన్నట్లు తెలిపారు. తక్కువ ధరకే లభించే వస్త్రాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆప్కో డివిజనల్ వాణిజ్యాధికారి సోమేశ్వరరావు, ఆప్కో డీఓ శేఖర్, లీలాకుమార్, ముఖర్జీ, వివిధ సహకార ఉత్పత్తి విక్రయ సంఘాల అధ్యక్షులు, మేనేజర్లు, సేల్స్ మెన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి న్యాయం.. చదువుకు సాయం



విద్యార్థులకు విద్యాదీవెన చెక్కును అందజేస్తున్న దృశ్యం

- జగనన్న విద్యా దీవెన నిధుల విడుదల
- జిల్లాలో 53,867 మంది విద్యార్థులకు లబ్ధి
- తల్లుల ఖాతాల్లో రూ.31,40,71,490లు జమ

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేద విద్యార్థులకు పెద్ద చదువులు చేరువ చేయాలనే సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. జగనన్న విద్యాదీవెన కింద 2022 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి నిధుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లాలో ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 53,867మంది విద్యార్థులకు గాను 48,345 తల్లుల ఖాతాల్లో రూ.31,40,71,490ల నగదును జమ చేశారు.

- ఇందులో 4,124 మంది ఎస్సీ విద్యార్థులకు గాను 3,767 మంది తల్లుల ఖాతాల్లో రూ.3,37,14,218లు పడ్డాయి.
- 1,373 మంది ఎస్టీ విద్యార్థులకు గాను 1,272 మంది తల్లుల ఖాతాల్లో రూ.52,97,414లు జమయ్యాయి.
- 45,761 మంది బీసీ విద్యార్థులకు గాను 40,968 మంది తల్లుల ఖాతాల్లో రూ.25,84,54,696లు వేశారు.
- 1,730 మంది ఈబీసీ విద్యార్థులకు గాను 1,588 మంది తల్లుల ఖాతాల్లో రూ.99,14,522లు జమ చేశారు.
- 157 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు గాను 143 మంది తల్లుల ఖాతాల్లో రూ.8,26,919లు, 703 మంది కాపు విద్యార్థులకు గాను 668 మంది తల్లుల ఖాతాల్లో రూ.56,95,178లు, 19 మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు గాను 17 మంది తల్లుల ఖాతాల్లో రూ.1,68,543లు మొత్తం 48,345 మంది తల్లుల ఖాతాల్లో రూ.31,40,71,490లు జమచేశారు.

జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌చార్జి ఉప సంచాలకులు, బీసీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఆర్.గడ్డెమ్మ, గిరిజన సంక్షేమం ఉప సంచాలకులు బి.నగేష్, బీసీ సంక్షేమ అధికారి ఇ.అనూరాధ, డీపీఎం పొట్నూరు శరత్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నమూనా చెక్కును అందజేశారు.

గేట్‌లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సత్తా

ఎచ్చెర్ల క్యాంపస్: గేట్ ఫలితాల్లో శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థులు సత్తాచాటారు. శ్రీకాకుళం క్యాంపస్ నుంచి 46 మంది విద్యార్థులు అర్హత మార్కులు సాధించగా, జి.శివప్రసాద్‌రెడ్డి సీఎస్ ఈ విభాగంలో 21వ ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థిది విజయవాడకాగా, శ్రీకాకుళం క్యాంపస్‌లో చదువుతున్నాడు. ఈ విద్యార్థితో పాటు బి.జీవన సంధ్యారాణి ఈసీఈ విభాగంలో 78వ ర్యాంకు, కె.దీపక్ మెకానికల్ విభాగంలో 80వ ర్యాంకు, బి.రామకృష్ణ ఈసీఈలో 139వ ర్యాంకు, ఎస్.వినయ్‌కుమార్ ఈసీఈ 152వ ర్యాంకు, ఎస్.శ్రీసాయి ఈసీఈలో 337వ ర్యాంకు, కె.నాగేంద్ర ఈసీఈలో 635వ ర్యాంకు, పి.రవివెంకట్ ఈసీఈలో 694, పి.కుమార్ ఈసీఈలో 1257 ర్యాంకు సాధించారు. వీఐని అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో రక్షణశాఖ జాయింట్ సెక్రటరీ



హరిప్రసాద్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ పూడి హరిప్రసాద్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. సమీప బంధువు, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ ఈవో వి.హరి సూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మలు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సాయం అందజేస్తానని, గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇంద్రపుష్కరిణికి సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయించాలని ఈవోకు సూచించారు.

22న జిల్లా స్థాయి కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: ఉగాది సందర్భంగా ఈ నెల 22న తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జిల్లా స్థాయి కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెరవే అధ్యక్ష కార్యదర్శులు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల కవులు ఉగాది, సామాజిక హితపరమైన అంశాలపై స్వీయ కవితా రచనలతో హాజరు కావాలని కోరారు. ముందుగా 8247698922 నంబరుకు ఫోన్‌చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఒత్తిడి వీడితేనే విజయం



తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ

నందిగాం: పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఒత్తిడిని విడిచి పెట్టి లక్ష్యం వైపు దృష్టి పెట్టాలని డీఈఓ గార పగడాలమ్మ సూచించారు. ఆదివారం నందిగాం మండలం లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు డీఈఓ వెళ్లారు. విద్యార్థుల చదువులపై వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సమీపిస్తున్నందున ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పోషకవిలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. పరీక్షలపై భయం, ఒత్తిడి విడిచి పెడితే విజయం సొంతమవుతుందన్నారు. అంతకుముందు ఉపాధ్యాయులతో హెచ్‌ఎం చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి శతశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసిప్రసాద్, రత్నం, ప్రకాష్ పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య!



లలితాజ్యోతి(ఫైల్)

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధిలోని పాత జాతీయ రహదారిలో ద్విచక్ర వాహనషోరూం ఎదురుగా ఉన్న అపార్ట్‌మెంట్‌లో వివాహిత ఆత్మహత్య చేసుకున్నట్లు కాశీబుగ్గ సీఐ జి.శంకరరావు తెలిపారు. కాశీబుగ్గలోని ఓ కంపెనీ ద్విచక్ర వాహన షోరూం నిర్వహిస్తున్న టెక్కలికి చెందిన జయవర్ధన్‌తో 2017లో రాజమండ్రికి చెందిన లలితాజ్యోతి(35)తో వివాహం జరిగింది. వీరికి తొలుత ఓ మగశిశువు జన్మించాడు. పుట్టిన వెంటనే మరణించాడు. మూడేళ్ల క్రితం హిమేష్ జన్మించాడు. కొన్నాళ్లుగా లలితాజ్యోతికి భర్త, అత్త, ఆడపడుచులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ బిడ్డను నిత్యం హింసించేవారని, కన్నవారి ఇంటికి రెండున్నరేళ్లుగా రాకుండా అడ్డుకుంటున్నారని, కనీసం ఫోన్‌లో కూడా మాట్లాడనివ్వకుండా ఇబ్బందులు పెట్టేవారని, గతంలోనూ బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. కుమార్తె మృతిపై అనుమానాలున్నాయని, భర్తే చంపేసి ఫ్యాన్‌కు వేలాడదీశారని ఆరోపిస్తున్నారు. పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని కోరుతున్నారు. కాగా, పోలీసులు మృతదేహాన్ని పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

పంట పండింది!



బసవరాజుపేట వద్ద వంశధార తీరంలో వాణిజ్య పంటల సాగు

- ఖరీఫ్‌ను మించి పచ్చని పైర్లు
- జిల్లాలో 85 వేల హెక్టార్లలో రబీ సాగు
- కళకళలాడుతున్న సాగునీటి వనరులు
- చిరుధాన్యాల సాగుపైన ఆసక్తి చూపిన రైతులు

ఎల్.ఎన్.పేట: వాణిజ్య పంటల సాగు ఆశాజనకంగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డిసెంబర్, జనవరిలో రబీ సాగు ప్రారంభించినప్పటి నుంచి వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో ఖరీఫ్ సీజన్‌కు మంచి పంట పొలాలు పచ్చగా కనిపిస్తున్నాయి. వంశధార, నాగావళి, మహేంద్రతనయ తదితర జీవనదులు చెంతన సాగునీటికి ఇబ్బంది లేకపోవటంతో వాణిజ్య పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. చెరువులు, వంశధార కుడి, ఎడమ ప్రధాన కాలువలు కూడా కళకళలాడుతుండటంతో సాగునీటికి ఇబ్బంది లేకుండా ఉంది. ఏప్రిల్ నెలాఖరు వరకు సాగునీరు అందితే పంట పండినట్లేనని రైతులు చెబుతున్నారు.

చురుగ్గా అపరాల కోతలు..

మరో వారం పది రోజుల్లో అపరాల పంటలైన పెసర, మినుము కోతలు పూర్తి కావస్తున్నాయి. ఇప్పటికే 80 శాతానికిపైగా పంట కోత పూర్తయింది. ఖర్బూజా పంట చేతికి అందివచ్చింది. రబీ వరితో పాటు హైబ్రీడ్ పెసర, మొక్కజొన్న, నువ్వు, కట్టిజనుమ, సారికంద, వేరుశనగ, ఉలవ తదితర వాణిజ్య పంటలతో చేలు కళకళలాడుతున్నాయి.

పెరిగిన సాగు విస్తీర్ణం..

జిల్లాలో సుమారు 40 వేల హెక్టార్లలో రబీ పంటలను సాగు చేస్తున్నారు. కొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి, జలుమూరు, నరసన్నపేట, పోలాకి ఎల్.ఎన్.పేట, హిరమండలం, సరుబుజ్జిలి, బూర్జ, టెక్కలి, సారవకోట, కోటబొమ్మాళి, లావేరు, జి.సిగడాం, ఎచ్చెర్ల, నందిగాం, పలాస, సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు తదితర మండలాల్లో రబీ సాగు జరుగుతోంది. సుమారు 150 హెక్టార్లలో రాగులు (చోడి), ఇతర చిరుధాన్యాలను పండిస్తున్నారు. గతంలో 100 హెక్టార్ల కంటే తక్కువలో సాగయ్యే చిరుధాన్యాల సాగు నేడు గణనీయంగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

పంట	సాగు విస్తీర్ణం	
మొక్క జొన్న	29,520	హెక్టార్లు
మినుము	21,752	హెక్టార్లు
పెసర	14,628	హెక్టార్లు
వరి	12,420	హెక్టార్లు
వేరుశనగ	4,126	హెక్టార్లు
నువ్వులు	1,240	హెక్టార్లు
ఉలవ	895	హెక్టార్లు
కట్టిజనుమ	650	హెక్టార్లు
పొద్దుతిరుగుడు	180	హెక్టార్లు

ఆశాజనకం..



రెండో పంటగా వేసవిలో పండించుకునే రబీ పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ఏడాది ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాం. ఎటు చూసినా పచ్చని పంట పొలాలే కనిపిస్తున్నాయి. పంట చేతికి అందిన సమయంలో దళారుల బెడద లేకుండా కనీస మద్దతు ధర లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – అశోక్ పాణిగ్రహి, రైతు, లక్ష్మీనర్సుపేట

అవగాహన కలిగిస్తున్నాం



రబీలో వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకేల్లో పనిచేస్తున్న గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకుల ద్వారా తగిన సూచనలు ఇస్తున్నాం. పొలంబడి వంటి కార్యక్రమాలు నిర్వహించి అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహిస్తున్నాం. -ఎల్.వి.మధు, ఏడీఏ, పలాస

తెలుగు జానపద స్వర్ణోత్సవాల్లో 'బద్రి'



జ్ఞాపిక అందుకుంటున్న బద్రి కూర్మారావు

పలాస: హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఆదివారం జరిగిన తెలుగు జానపద సాహిత్య పరిషత్ స్వర్ణోత్సవాల్లో బద్రి కూర్మారావు ప్రాతినిధ్యం వహించారు. స్వర్ణోత్సవ ప్రత్యేక సంచిక 'జానపద సరస్వతి-2022'లో బద్రి కూర్మారావు రాసిన గై(గౌ)రమ్మ పాటలు, ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల తులనాత్మక పరిశీలన అనే వ్యాసం ప్రచురితమయ్యాయి. ఈ సంచికను విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసరు తంగెడి కిషన్‌రావు వేదికపై ఆవిష్కరించారు. గుస్సాడి, కోలాటం, ఉరుములు, చెక్కభజన తదితర జానపదాలను ప్రదర్శించారు. ఉత్తరాంధ్ర జానపదాలను బద్రి కూర్మారావు, అందాల కోటేశ్వరరావు పాడి వినిపించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టరు వసుంధరారెడ్డి, కార్యదర్శి చిగిచర్ల కృష్ణారెడ్డి, పగడాల చంద్రశేఖర్, మాజీ వైస్ చాన్సలర్ ఎద్లూరి శివారెడ్డి, జానపద రచయితలు పాల్గొన్నారు.

నిజాయితీగా పనిచేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

శ్రీకాకుళం అర్బన్: సహకార సంఘాలు అభివృద్ధి చెందాలంటే నిజాయితీ కలిగిన నాయకులు ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు అన్నారు. నేషనల్ సెంటర్ ఫర్ కో ఆపరేటివ్ ఎడ్యుకేషన్(న్యూ ఢిల్లీ) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్(విజయవాడ), రామదాసు సహకార శిక్షణా కేంద్రం (రాజమండ్రి) సంయుక్తంగా శ్రీకాకుళం ఎన్‌జీవో కార్యాలయంలో రెండో రోజు ఆదివారం పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకవర్గం తీసుకునే నిర్ణయాలు, సమావేశాల్లో చేసే తీర్మానాలు మత్స్యకారుల ప్రయోజనాలు కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. చాలా సహకార సంఘాలు ఆర్థికంగా వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సహకార సంఘాల ఆవశ్యకత, విధులు, హక్కులు తెలుసుకుని మత్స్యకారుల అభివృద్ధికి నాయకత్వం కృషి చేయాలని కోరారు. తరచూ సమావేశాలు నిర్వహిస్తూ సత్వర నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, మత్స్యశాఖ ఏడీ సంతోష్‌కుమార్, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పూజారి జానకిరాం, ఎం.శ్రీనివాసరావు, మైలపల్లి పోలీసు, మైలపల్లి నాగరాజు, పుక్కళ్ల శ్రీరామ్మూర్తి, సహకార శాఖ సిబ్బంది, వివిధ మత్స్యకార సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విత్తన గుళికలతో బహుళ ప్రయోజనాలు



భగీరథపురంలో శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: విత్తన గుళికలతో అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు రిసోర్సుపర్సన్ సీహెచ్ వెంకటరమణ అన్నారు. ఎచ్చెర్ల మండలం భగీరథపురంలో ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు ఆధ్వర్యంలో రైతులకు విత్తణ గుళికల తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరాలు, కూరగాయలు, తృణధాన్యాలను విత్తణ గుళికలుగా తయారు చేసుకోవాలని సూచించారు. బంకమట్టి, పేడ ఇతర వ్యర్థాలతో విత్తనాలు కలిపి గుళికలుగా తయారు చేస్తే మొలక శాతం పెరుగుతుందన్నారు. మొక్క ఎదుగుదల మెరుగ్గా ఉండి పంట దిగుబడి బాగుంటుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులకు రైతులు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రచారకురాలు అంబటి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఊరి కోసం కలిసికట్టుగా..!



పద్మపురం గెడ్డలో చెట్లు తొలగించిన దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: భారీ వర్షం కురిస్తే చాలు.. గెడ్డలు, వాగులు నిండి ఆ గ్రామం వారం రోజుల పాటు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన పరిస్థితి. పంట పొలాల్లో వరద నీరు కనీసం పక్షం రోజులైనా ఉండాల్సిందే. అందుకే ఎవరో వస్తారని, ఏదో చేస్తారని ఎదురు చూడకుండా స్వయంగా గ్రామస్తులే రంగ ప్రవేశం చేసి సమస్యను పరిష్కారించుకున్నారు. ఇచ్ఛాపురం మండలం తులసిగాం పంచాయతీ ఇన్నేశుపేట గ్రామం లోతట్టు ప్రాంతంలో ఉండటంతో బాహుదానది ఉప్పొంగినా, భారీ వర్షాలు కురిసినా పద్మపురం-దండు గెడ్డలు ఉప్పొంగి గ్రామం నీటి ప్రవాహంలో ఉండిపోతుంది. గతంలో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు పద్మపురం గెడ్డకు ఇరువైపులా ఉన్న భారీ వృక్షాలు కూలి గెడ్డలో నీటికి అడ్డంగా ఉండటంతో వరదనీరు గ్రామంలోకి, పంట పొలాల్లోకి చొరబడుతోంది. చెట్ల తొలగింపులో జాప్యం జరగడంతో గ్రామస్తులు సుమారు ఐదు లక్షల రూపాయలు వెచ్చించి శ్రమదానంతో పద్మపురం గెడ్డకు ఇరువైపులా ఉన్న చెట్లు తొలగించడంతో పాటు నీటిలో ఉన్న చెట్లను తొలగించారు. దీంతో గ్రామస్తులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఇరిగేషన్ అధికారులు స్పందించి గెడ్డలో పేరుకుపోయిన మట్టి, ఇసుకను పూర్తిస్థాయిలో తొలగించాలని కోరుతున్నారు.

యాదవులంతా ఐక్యంగా ఉండాలి



ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

నందిగాం: వెనుకబడిన యాదవ సామాజిక వర్గాన్ని గుర్తించి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి శాసనసభలో యాదవుల గొంతు వినిపించేలా చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉందామని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎమ్మెల్సీగా గెలిచిన అనంతరం మొదటిసారి నందిగాం వచ్చిన సందర్భంగా స్థానిక యాదవ నాయకుడు చిన్ని జోగారావు యాదవ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌పార్టీ కార్యాలయం వద్ద నర్తును సత్కరించారు. ముందుగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం నర్తు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ వల్లే యాదవులకు గుర్తింపు వచ్చిందని, యాదవులంతా పార్టీకి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో దట్టి శాంతారావు, పల్ల అప్పారావు, బోరుభద్ర సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావుకు ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి కొర్లాం జంక్షన్ వద్ద ఘన స్వాగతం పలికారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు.

అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళా దినోత్సవం పురస్కరించుకుని పారిశుద్ధ్యం, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ఉమెన్ ఐ-కాన్ లీడింగ్ పేరిట శ్రీకాకుళం నగరపాలక స్వచ్ఛ- 2023 అవార్డుల అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ, మురుగునీటిని శుద్ధీకరణ చేసి తిరిగి ఉపయోగించు పద్ధతులు, తడి పొడి చెత్త సేకరణ, చెత్తను తరలించే పద్ధతులు, పొడి చెత్తను వినూత్న రీతిలో వినియోగించడం, చెత్త నుంచి సంపద తయారీ, చెత్తతో కళాకృతులు, సేంద్రియ ఎరువుల తయారీ, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, సాంకేతికత, నూతన ఆవిష్కరణలు విభాగాల్లో కృషి చేస్తున్న స్వయం సహాయక సంఘాల సభ్యులు, మైక్రో ఎంటర్‌ప్రైజెస్, నాన్ గెజిటెడ్ ఆర్గనైజేషన్ తదితర విభాగాలకు చెందిన మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 22లోగా మున్సిపల్ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి జూన్ 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పురస్కారాలు అందజేస్తామని కమిషనర్ తెలిపారు.

ఉగాది సాహిత్య పురస్కారాల ప్రదానం



ఉగాది పురస్కారాలతో రచయితలు

శ్రీకాకుళం కల్చరల్: శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో కవితా నిలయం ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగాతపస్వి పత్రిక వ్యవస్థాపకులు ఎస్.కార్తీక్ మాట్లాడుతూ కాశీపట్నం రామారావు (కారా) మాస్టారు స్ఫూర్తితో ఈవేమన కవితా నిలయం నిర్వహించడం అభినందనీయమన్నారు. కథా నిలయం సభ్యుడు కాశీపట్నం సుబ్బారావు మాట్లాడుతూ సంస్థ పూర్తిస్థాయిలో పని చేసి కవులు, రచయితలను ప్రోత్సహించాలన్నారు. సురంగి మోహనరావు మాట్లాడుతూ వచన, పద్య కవితల సంపుటాలను కవితా నిలయంలో భద్రపరిచేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఉగాది కవితా సంపుటి పోటీల్లో తొలి మూడు స్థానాల్లో నిలిచిన చింతా అప్పలనాయుడు(బువ్వపువ్వు-పార్వతీపురం), చోడవరపు వెంకటలక్ష్మీ (మౌనానికిదా సమయం-శ్రీకాకుళం), మిరప మహేష్ (బువ్వకుండ)లకు పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార రాజు, రచయితలు ఎర్రమ్మ, రవికిరణ్, కాపురెడ్డి శ్రీను, ముక్కు కమల, భోగెల ఉమామహేశ్వరరావు, బూర్జ కోటేశ్వరరావు, చిన్నారావు, కుదమ తిరుమలరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాడీబిల్డింగ్ పోటీలు



కండల ప్రదర్శనలో బాడీబిల్డర్లు



55 కేజీలలోపు బరువు విభాగంలో విన్నర్‌గా నిలిచిన జ్యోతికుమార్

- మిస్టర్ ఆంధ్రా పోటీలకు రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: సిక్కోలు వేదికగా మిస్టర్ ఆంధ్రా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. శ్రీకాకుళం జిల్లా స్టార్ బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియం వేదికగా ఆదివారం సాయంత్రం 25వ ఏపీ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా బాడీబిల్డింగ్ సంఘ ప్రధాన కార్యదర్శి, ఏపీబీబీ రాష్ట్ర అసోసియేట్ కార్యదర్శి వి.విజయ్‌కుమార్, బి.ప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి హాజరైన బాడీబిల్డర్లు శరీర సౌష్టవాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో నాయకులు అంధవరపు సూరిబాబు, సుంకరి కృష్ణకుమార్, గుండ లక్ష్మీదేవి, గొండు శంకర్, మాదారపు వెంకటేష్, మాదారపు డేవిడ్, అల్లిబిల్లి సత్యనారాయణ, బి.సూరిబాబు తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీబీబీ ముఖ్య సలహాదారు కె.గురునాథరావు (విశాఖ), ఏపీబీబీ రాష్ట్ర అధ్యక్షుడు కె.సోమునాయుడు (అనకాపల్లి), టి.రాము (విశాఖ), జె.కిరణ్, జి.విష్ణుమూర్తి, ఎ.శ్రీను, బాలు, రమేష్, సుబ్బారావు రిఫరీలుగా వ్యవహరించారు.

విజేతలు వీరే..

- 55 కేజీలలోపు విభాగం: ఎ.జ్యోతికుమార్ (శ్రీకాకుళం), ఎ.చిత్తరంజన్ (విశాఖపట్నం), షేక్ జాతిర్ (విశాఖపట్నం), ఎం.రాంకీ (అనకాపల్లి), బి.గణపతి (శ్రీకాకుళం), కె.ప్రసాద్ (విశాఖపట్నం) మొదటి ఆరు స్థానాల్లో నిలిచారు.
- 60 కేజీలలోపు విభాగం: ఎ.సంతోష్‌కుమార్ (శ్రీకాకుళం), ఎం.నూకరాజు (విశాఖపట్నం), కె.స్వామి (కాకినాడ), జి.రవి (విశాఖపట్నం), ఎ.సూర్యప్రకాష్‌నాయుడు (అనంతపురం), బి.రమేష్ (విజయనగరం).
- 65 కేజీలలోపు విభాగం: జి.హేమంత్ (విశాఖపట్నం), ఎస్.సంతోష్‌రెడ్డి (విశాఖపట్నం), ఎన్.రమణ (ఏలూరు), ఎస్ఎస్‌వీ సునీల్ (విశాఖపట్నం), కె.గణేష్ (గుంటూరు), జీఈపీ పృథ్వీ (అనకాపల్లి)
- 70 కేజీలలోపు, 75, 80, 85, 90కేజీలలోపు, మాస్టర్స్ బరువు కేటగిరిల్లో పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.